# వేగం

సాయంత్రం అయిదింటికి కారు వేసుకుని రవీంద్ర ఇంటికి వెళ్ళాను. చుట్టాలెవరో వచ్చినట్టుంది. అతని ఇల్లు సందడిగా ఉంది. ఎక్కువ ఆలస్యం చేయకుండా వచ్చి, కారులో కూర్చుంటూ, "మావాళ్ళు బయటకు వెళ్దామని తయారవుతున్నారు" అన్నాడు. రవీంద్రకు కూడా కారుంది. నాకారు కన్నా మంచికారు. వాళ్ళావిడకు డ్రయివింగ్ వచ్చు. రవీంద్ర కారును బాగానే నడుపుతాడు. అతని వేగమే నాకు భయం కలిగిస్తూ ఉంటుంది. మామూలు సమయం లోనే కారు వేగంగా నడిపిస్తుంటాడు. మందుకొట్టినప్పుడు వేగం ఎక్కువ అవుతుంటుంది. తన కారు కంటే నాకారు నడపడానికి ఇష్టపడుతుంటాడు. అతను నడుపుతున్నప్పుడు పక్కన నేను కూర్చుంటే తప్ప అదుపులో నడపడు. అతనికి నా కారు తాళాలు ఇస్తున్నప్పుడు భయంగానే ఉంటుంది. ఉండలేక నేనేదయినా అంటే, "నేను ఇరవయి సంవత్సరాల నుండి కార్లు నడిపిస్తున్నాను. అప్పటినుండి ఎటువంటిప్రమాదం జరగలేదు. నామాటలు అబద్ధాలనిపిస్తే, మా వాళ్ళనడుగు. చిన్నగీతలు పడడం బంపర్లు దెబ్బతినడం మామూలు విషయాలు. అవి మన తప్పు కాకపోయినా జరుగుతుంటాయి."అంటాడు. కావొచ్చు.అయినా నా భయం మటుకు అలానే ఉంది.

"ఎటు వెళ్దాం?" అడిగాడు.

"నెక్లెస్ రోడ్డు అయితేనో?"అన్నాను.

"సరే."

కారు కదలబోతోంటే అతని పన్నెండేళ్ళ అబ్బాయి పరుగెత్తుకుంటూ రవీంద్ర దగ్గరకు వచ్చి, "అమ్మ, వెయ్యి రూపాయలు ఇమ్మంటోంది" అన్నాడు. రవీంద్ర కారాపి జేబులోంచి పర్సు తీసి ఇచ్చాడు. వాడి పేరు రఘు. కారు కదిలింది.

నెక్లెస్‌రోడ్డు చేరుకున్నాం. ఆ రాత్రిజరగబోయే సంగీత కార్యక్రమానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. పార్కింగ్ పలచగా ఉంది. పార్కింగ్ లాట్‌చివరి వరకూ తీసుకొచ్చి

కారాపాడు. జనం అట్టే లేరు. సన్నగా చీకటి పడుతోంది. కేసెట్‌లోంచి పాట వినిపిస్తోంది. మా మాటలు ఆఫీసు పనుల మీద, రాజకీయాలమీద నడవవు. అతనికి సంగీత మంటే ఇష్టం. నాకు సాహిత్యమంటే ఇష్టం. అలా అని అతను సంగీత గోష్టులకు, నేను సాహిత్యసభలకు ఎగేసుకుని వెళ్లం. తీగ కదిలిస్తే చాలు ఎక్కడకక్కడ రాజకీయ పాదులు కనిపిస్తుంటాయి. వీయినంతవరకు దూరంగానే ఉండటం అలవాటయింది.

సీసా బయటకు తీశాను. నేను మూడు పెగ్గుల కంటే ఎక్కువ తాగలేను. అతను సమయం తీసుకుంటూ అయిదు పెగ్గుల కంటే ఎక్కువ తీసుకోడు. కారు నడపాల్సి వచ్చినప్పుడు ఒక పెగ్గు తక్కువ తీసుకుంటాడు. కబుర్లు చెప్పుకుంటూ తొమ్మిదింటి వరకు కూర్చున్న తర్వాత, "బయల్దేరదామా?" అన్నాడు.

మందు అయిపోయినా చల్లగా వీచే గాలికి కూర్చుందామనిపిస్తోంది. నేనేం మాట్లాడక పోయేసరికి, "మావాడు నూడుల్స్ కావాలన్నాడు" అన్నాడు. మా పిల్లలకూ తీసుకుందామనిపించింది. మాఇంటికి వెళ్ళే దారిలోనేమంచి హోటలుంది. "సరే" అన్నాను.

పార్కింగ్‌లాట్‌లోంచి కారు బయటకు తీశాడో, లేదో పోలీసు కానిస్టేబుల్ మా కారు దగ్గరకు వచ్చి కారాపాడు. కారులో కూర్చుని మందుకొట్టిన సంగతి అతనికి అర్థమయి ఉండాలి. రవీంద్ర జేబులోంచి యాభయి రూపాయల నోటుతీసి అతనికి ఇవ్వబోయాడు. నెల కిందట గండిపేట దగ్గర మేమున్న కారు ఇలానే పోలీసు ఆపినప్పుడు వందరూపాయలతో సరిపెట్టుకున్నాడు. ముందే వందిస్తే మరోవంద అడుగుతారు. యాభయితో మొదలయితే కాదు, కూడదన్నా రెండు వందలతో చేతులు దులుపుకోవచ్చు. కానిస్టేబుల్ యాభయి రూపాయలనోటు తీసుకోలేదు.

"ముందు కారు దిగండి" అన్నాడు. మాటలు కటువుగా ఉన్నాయి.

నేనింకో యాభయి కలిపి, "ఇది కూడా తీసుకో" అన్నాను.

"కారు దిగుతారా, లేదా?"

"ఎందుకు దిగాలి? నీ పేరేమిటి?" గొంతుపెంచి అన్నాడు రవీంద్ర.

"తాగినందుకు" అన్నాడు కాని తన పేరు చెప్పలేదు. అవి ప్రొహిబిషన్ రోజులు. అతను మమ్మల్ని వదిలేట్టు లేదు. ఇంకో వంద ఇవ్వబోయినా అతను తీసుకోలేదు.

రవీంద్ర కారు ఆపినట్లు ఆపి వెంటనే స్టార్టు చేశాడు. పోలీసు కారు ముందుకు రాబోయి పక్కకు తప్పుకున్నాడు. కారు వేగం పుంజుకుంది. అటువంటి అనుభవం మాకెప్పుడు ఎదురుకాలేదు. నేను వెనక్కి తిరిగి చూడలేదు. పోలీసు నా కారు నెంబరు నోటు చేసుకుని ఉంటాడు. వైర్‌లెస్ మెసేజ్ ఇస్తే ఏ సెంటర్‌లోనో మమ్మల్ని పట్టుకుంటారు. చిన్నగా మొదలయిన భయం ఒళ్ళంతా పాకుతోంది. తాగిన మత్తు దిగిపోవడం మొదలెట్టింది. ట్రాఫిక్‌లో నాకు చాలా పరిచయం ఉన్న పోలీసు ఉన్నతాధికారులు లేకపోలేదు. వాళ్ళనడిగితే సహాయం చేయరని కాదు.

"ఒక్కసారి వెనక్కి తిరిగి చూడు. పోలీసు బండేదయినా మన వెనక వస్తోందా?" అడిగి కారు వేగం పెంచసాగాడు.

వెనక్కి తిరిగి చూశాను. నాలుగు మోటారు బయిక్‌లు కనిపించాయి. అవి పోలీసులవి కావు. "లేదు. ఎవరూ రావడం లేదు. కారు వేగం తగ్గించు..."అన్నాను. అతను వేగం తగ్గించలేదు. కారు మెయిన్‌రోడ్డు మీదకు తీసుకువచ్చాడు. వచ్చి వెళ్ళే వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంది.

లుంబినీ పార్కుమలుపులో కారు తిరుగుతుండగా కారు హెడ్ లయిట్స్‌లో, ఉండుండి వెలుగుతున్న వీధి దీపపు వెలుతురులో, రవీంద్ర గమనించలేదనుకుంటాను, అప్పటికే పాదచారి రోడ్డు మధ్యకువచ్చేవాడు. అంత వేగంగా ఉన్న తాకిడికి అతను ఎగిరి రోడ్డు పక్కన ఉన్న రాళ్ళమీద పడ్డాడు.

రవీంద్ర కారాపలేదు. "ప్రమాదం జరిగింది" అన్నాడు నెమ్మదిగా.

"కారాపు అతనికి పెద్ద దెబ్బే తగిలినట్టే ఉంది".

"కారాపితే జనం మనమీద పడి చచ్చేట్టు కొడతారు. కారు తుక్కు తుక్కు చేస్తారు... " ఎడమ వయిపుకు మలుపు తిప్పి టాంక్‌బండ్ రోడ్డు మీదకు పోనిస్తూ, "అవును. పెద్ద దెబ్బే తగిలి ఉండాలి" అన్నాడు.

"అందుకనే కారు ఆపమంటున్నాను...." అంటోంటే నా మాటలకు అడ్డు తగిలి, "కారాపితే ఏం జరుగుతుందో చెప్పాను. అర్థం కావడం లేదా?" విసుగ్గా అన్నాడు.

కోపం, దుఃఖం ఆగలేదు. ఏడుస్తూ అన్నాను, "ఇప్పుడు ప్రమాదానికి గురయిన కుర్రాడు నీ కొడుకురా, రఘు".

❖ రచన, ఆదివారం వార్త, 6 ఏప్రిల్ 2008